అల్లూరుకు ఎమ్మెల్యే నివాళులు

ముమ్మిడివరం: రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం సందర్శించారు. మృతదేహం వద్ద పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కృష్ణంరాజు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.







ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



టి.కొత్తపల్లిలో మహిళకు మంచినీటి బిందెను అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నడిమిలంక, నక్కవారిపేట గ్రామాల్లో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శంకరరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ రెడ్డి హేమసుందరి, టౌన్ పార్టీ అధ్యక్షుడు బొంతు సత్య శ్రీనివాస్, వేటుకూరి బోస్, సరిపల్లి రామకృష్ణంరాజు, దేవరపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో పూర్తి పారదర్శకత

ఐ.పోలవరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లిలో గురువారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో సీతమ్మ చెరువుగట్టు వద్ద జలజీవన్ మిషన్ ద్వారా రూ.42 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయి, నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే పొన్నాడ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక మహిళలకు తాగునీటి బిందెను అందజేశారు. అడవిపేటలో నూతనంగా ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్లే సాధ్యపడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యకు నియోజకవర్గంలో 81 గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆయన అభిమానులు గజమాలతో, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ పండు నళిని, ఢిల్లీ నారాయణ, పండు సుమలత, కొమానపల్లి శ్రీను, వడ్డి గౌతమ్, దంతులూరి రాఘవరాజు, మెండా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



నెల్లి జైశ్యామ్



సుతాపల్లి గీతిక



కర్రా స్వర్ణగీత



రావి రామ్‌గోపాల్‌తేజ

కొత్తపేట/అంబాజీపేట: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి, స్థానిక శ్రీనివాసపేటకు చెందిన నెల్లి జైశ్యామ్ టెన్త్‌లో 561 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో మండలం ప్రథముడిగా నిలిచాడు. అలాగే, స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సుతాపల్లి గీతిక పదో తరగతిలో 559 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ విద్యార్థులిద్దరూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎంలు అల్లూరి గోపాలరాజు, ఎస్.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, పీఎంసీ చైర్మన్లు బీర శ్రీనివాసరావు, ములపర్తి శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా, అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రావి రామ్‌గోపాల్‌తేజ ఒంగోలు, కర్రా స్వర్ణగీత నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కడలి సాయిరామ్ తెలిపారు. రామ్‌గోపాల్‌తేజ పదో తరగతిలో మండలం ప్రథమ, నియోజకవర్గంలో తృతీయ స్థానాలు సాధించాడు.

స్వర్ణగీత మండలం ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ విద్యార్థులను ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, విద్యాకమిటీ చైర్మన్ అరిగెల రామతులసి, డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, స్టాఫ్ కార్యదర్శి వెన్నపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నాం



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

మామిడికుదురు: సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని ఓఎన్‌జీసీ తాటిపాక ఏరియా మేనేజర్ కేజేఎం రావు అన్నారు. స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా ఓఎన్‌జీసీ ఆధ్వర్యాన పాశర్లపూడిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం, దేశాన్ని ప్రగతి పథంలో నడిపిద్దాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. తొలుత 200 మంది స్థానికులకు టీ షర్టులు, టోపీలు, జొన్నలు, రాగులు, పండ్లు అందజేశారు. గ్రామ పంచాయతీకి ఐదు డస్ట్‌బిన్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రావు మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన తీసుకు వచ్చే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ది యంగ్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.సుశీల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు అంకాని వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఓఎన్‌జీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసంలో అనేక పోషకాలు

కె.గంగవరం: పాడి పశువులకు కావాల్సిన అనేక పోషకాలు పశుగ్రాసంలో ఉంటాయని దంగేరు గ్రామ పశువైద్యాధికారి కేవీ రామరాజు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా పశుగ్రాసం ప్రాముఖ్యత, సాగు, నిల్వ పద్ధతులపై పశుపోషకులకు గ్రామంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం సహాయం అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేలు రకం పశుగ్రాసం పెట్టడం వల్ల పశువులకు మంచి ఆరోగ్యంతో పాటు పాల దిగుబడి కూడా పెరుగుతుందని చెప్పారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

మండపేట: ఏడిద గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు హాజరయ్యారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.72.28 లక్షల నిధులకు సంబంధించి 248 పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈఓ వుండమట్ల వీర్రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఎస్ఆర్‌పీ సీహెచ్ఎస్ సత్యనారాయణ, డీఆర్పీ బి.ధనుంజయ్ పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో తపాలా పథకాలు

రామచంద్రపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ వివిధ పథకాలు తీసుకు వచ్చిందని స్థానిక పోస్ట్‌మాస్టర్ జానకీ రామారావు అన్నారు. ప్రపంచ మేళా డే సందర్భంగా తపాలా శాఖ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ పోస్టల్ పథకాలతో పాటు మై స్టాంప్ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధాప్యంలో ఉన్న వారి వరకూ తపాలా శాఖ వివిధ పొదుపు, జీవిత బీమా పథకాలు అందిస్తోందని చెప్పారు. మై స్టాంప్ కార్యక్రమంలో భాగంగా అరుదుగా దొరికే స్టాంపులు విక్రయిస్తామని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



శాకంబరిగా ముత్యాలమ్మ



శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారు గురువారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని పండ్లు, కాయగూరలు, ఆకుకూరలతో సుందరంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వివిధ రకాల పిండివంటలు, పండ్లు ఫలహారాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

తీరంలో రెండో రోజు సాగర్ కవచ్



ఓడలరేవులో సాగర్ కవచ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీను నాయక్

అల్లవరం: సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా ఓడలరేవు తీరంలో రెండో రోజు ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. శత్రు దేశాలకు చెందిన దుష్ట శక్తులు తీరం వెంబడి చొరబడితే వారిని తీరంలో గస్తీ నిర్వహించే మెరైన్ పోలీసులు, పోలీసులు నిరోధించే ప్రక్రియే సాగర్ కవచ్ అని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
















ప్రజలకు వరం.. జగనన్న సురక్ష..

- ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తిస్తున్న వలంటీర్లు
- ధ్రువపత్రాల అందజేతపై లబ్ధిదారుల హర్షం



ముమ్మిడివరంలో లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు దరి చేర్చాలన్న సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. సాంకేతిక, ఇతరత్రా కారణాల వల్ల ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. వలంటీర్లు ఇంటింటా జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తించి వారికి ఏయే పథకాలు అందాల్సి ఉంది, వాటి కోసం ఏమేం ధ్రువీకరణ పత్రాలు కావాలో వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అనంతరం మండలాధికారులు గ్రామ సచివాలయ పరిధిలో శిబిరాలు ఏర్పాటుచేసి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మిడివరం మండలంలో 14 గ్రామ సచివాలయాలు, ముమ్మిడివరం నగర పంచాయతీలో 7 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన 17,686 మందికి అధికారులు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. ప్రధానంగా అర్హులకు 11 రకాల ధ్రువపత్రాలు ఇస్తున్నారు. జులై 1వ తేదీన ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 25 వరకూ నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికను మండల స్థాయి అధికారులు సిద్ధం చేశారు.

ముమ్మిడివరం మండలం, నగర పంచాయతీలో జగనన్న సురక్షలో అందించిన సేవలు

మండలంలో గ్రామ సచివాలయాలు	14	నగర పంచాయతీలో వార్డు సచివాలయాలు	7
మొత్తం కుటుంబాలు	15,814	మొత్తం కుటుంబాలు	6,333
సర్వే చేసిన కుటుంబాలు	4,400	సర్వే చేసిన కుటుంబాలు	3,616
జారీ చేసిన టోకెన్లు	15,698	జారీ చేసిన టోకెన్లు	3,616
జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు	15,176	జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు	2,510

వెంటనే కౌలు కార్డు ఇచ్చారు



నేను రెండెకరాల పొలం కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. జగనన్న సురక్ష కింద వలంటీర్ ఇంటికొచ్చి దరఖాస్తు ఫారానికి కావాల్సిన పత్రాలు తీసుకెళ్లారు. నాలుగు రోజుల్లోనే నాకు కౌలు కార్డు ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉచితంగా కార్డు ఇవ్వడం చాలా ఆనందమనిపించింది.

– పిండి లక్ష్మణరావు, కౌలురైతు, గాడిలంక

ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



వలంటీర్లను ఇంటింటికీ పంపించి సర్వే చేయిస్తున్నాం. ప్రతి కుటుంబానికి కావాల్సిన సర్టిఫికెట్లు ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

– జి.రాంబాబు, ఎంపీడీఓ, ముమ్మిడివరం

ఆస్పత్రికి వచ్చి.. పింఛన్ అందించి..

వలంటీర్ల స్పందన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన గంగారత్నానికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ జ్యోతి

గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సేవలను లబ్ధిదారురాలు చొల్లంగి చిన గంగారత్నం నేటికి గుర్తు చేసుకుంటుంది. మే 2న ఇంటిలో ఉండగా గుండెపోటుకు గురైతే ఆమె కుమారుడు రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆస్పత్రిలో తీసుకెళ్లి చికిత్స అందించారు. చిన గంగారత్నానికి ఆరోగ్యం బాగోలేదని తెలిసి అల్లవరం సచివాలయం–2లో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్ జ్యోతి తన భర్త సహకారంతో రాజమండ్రి బొల్లినేని ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారునికి వితంతు పింఛన్ అందించింది. – అల్లవరం

వలంటీర్ సేవలు మరిచిపోలేను



గుండెపోటుతో రాజమండ్రిలోని బొల్లినేని ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న సమయంలో వలంటీర్ జ్యోతి ఆస్పత్రికి వచ్చి అభయహస్తం, వితంతువు పింఛన్ అందించింది. వేలిముద్రలు పడక రేషన్ బియ్యం రాకపోతే వలంటీర్ దగ్గరుండి బియ్యం ఇప్పిస్తుంది.

– చొల్లంగి చిన గంగారత్నం, అల్లవరం పాలెం, అల్లవరం మండలం

కరోనా సమయంలో అండగా నిలిచారు



కరోనా సమయంలో మా కుటుంబ సభ్యులకు కరోనా సోకి ఇంట్లోనే ఉండిపోయాం. మేము బయటకు రాలేని పరిస్థితుల్లో ఉంటే మా గ్రామ వలంటీర్లు అంగాని దుర్గాప్రసాద్, కోలా కిషోర్ మాకు అండగా నిలిచి సేవలందించారు. కరోనా భయంతో మా బంధువులు సైతం మా ఇంటికి రావడానికి భయపడుతుంటే మేము ఫోన్ చేసి ఏదైనా కావాలంటే వెంటనే స్పందించి మాకు కావలసిన మందులు, నిత్యావసారాలను అందించి మనోధైర్యాన్ని నింపేవారు. ఆ సమయంలో వలంటీర్‌గా వారు చేసిన సేవ మరువలేనిది.

– కోరుమిల్లి వెంకట్రావు, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చిందాడగరువు గడప గడపకూ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- చిందాడగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు దరి చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని చిందాడగరువులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో దివ్యాంగులైన తాటికాయ గణేష్, దుర్గా మణికంఠ, మోహన్ సత్యలకు ప్రభుత్వం రూ.3,000 ఫింఛన్ ఇస్తుందని, దాన్ని రూ.10,000కు పెంచాలని తల్లిదండ్రులు కోరారు. చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి రూ.10 వేల పింఛన్‌కు డీఎంఅండ్‌హెచ్‌ఓకు నివేదించాలని పేరూరు వైద్యాధికారి వెన్నెల సాహితీకి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ పోనకల గణేష్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ జవ్వాది బుజ్జి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డ్ చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, కార్యదర్శి రుద్రరాజ సూరపరాజు, శీలం సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంపదరావు, జిల్లా అధికారి జ్యోతిలక్ష్మీదేవి

ఉప్పలగుప్తం: తల్లిదండ్రులకు దూరంగా వసతి గృహంలో ఉంటూ చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నతులుగా ఎదగాలని సాంఘిక సంక్షేమ సాధికారిక జిల్లా అధికారి జ్యోతిలక్ష్మీదేవి సూచించారు. గురువారం మండలంలోని గొల్లవిల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సహాయ సంక్షేమ అధికారి ఎస్.సత్యనారాయణలతో కలిసి ఆమె పరిశీలించారు. వసతి గృహంలో రికార్డులను తనిఖీ చేశారు. భోజనం, వసతి ఎలా ఉన్నాయో విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ బి.తులసి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ అందరికీ ఒకేలా ఇవ్వాలి

యానాం: ఎల్‌పీజీ గ్యాస్ సబ్సిడీ ఎరుపు రంగు రేషన్ కార్డుదారులకు ప్రకటించినట్లుగానే పసుపు రంగు రేషన్ కార్డుదారులకు సైతం ఒక్కో సిలెండర్‌కు రూ.300 ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి ఏఎం సలీమ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని కార్డులకు సబ్సిడీ సమానంగా ఇస్తామని బడ్జెట్ సమావేశాల్లో సీఎం రంగసామి హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పుడు మాట మార్చి పసుపురంగు కార్డులకు ఒక్కో సిలెండర్‌కు కేవలం రూ.150 మాత్రమే సబ్సిడీ ఇస్తామనడం సరి కాదన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం

అమలాపురం టౌన్: అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర ఆధ్వర్యంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పిండి రాజా, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బందా కామేశ్వరరావు, డీఆర్‌పి హేమలత తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు రిలే దీక్షలు



మూడో రోజు రిలే దీక్షలు చేస్తున్న కోపరేటివ్ సిబ్బంది

యానాం: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యానాం కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ 30 నెలల బకాయి జీతాలు అందక తామంతా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు, నాయకుల నిర్లక్ష్య వైఖరి వల్లే తాము రోడ్డు పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పుదుచ్చేరి ప్రభుత్వం స్పందించి బకాయిల చెల్లింపు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రిలే నిరాహార దీక్షలకు మాజీ మున్సిపల్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, వ్యాపారవేత్త తోటరాజు, బీసీ సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు, వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను తదితరులు సంఘీభావం తెలియజేశారు.

16 నుంచి వజ్ర వారాహి అఖండ హోమం



వారాహి హోమానికి విరాళం అందజేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: అత్యంత అరుదుగా వచ్చే పునర్వసు నక్షత్రయుక్త మకరలగ్నంలో ఈ నెల 16వ తేదీ ఆదివారం వజ్ర వారాహి అఖండ హోమం నిర్వహించనున్నట్లు గౌతమ మహర్షి అక్షయపాత్ర ప్రతినిధులు తెలిపారు. హోమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమై సోమవారం అర్ధరాత్రి 2 గంటలకు జరిగే మహా పూర్ణాహుతితో ముగుస్తుందన్నారు. కార్యక్రమానికి రేపాక సత్యనారాయణమూర్తి, చిన్నా కుటుంబ సభ్యులు రూ.30 వేలు, నల్లా ఎస్ఎస్ఎం అప్పారావు, శ్రీదేవి దంపతులు రూ.40 వేలు, పోతురాజు సత్యభారతి కుటుంబ సభ్యులు రూ.20 వేలు రూపాయలు గురువారం విరాళాలుగా అందించారు.

నూతన కమిటీ నియామకం



పెండెం శ్రీనివాస్

అమలాపురం రూరల్: బహుజన సమాజ్ పార్టీ అమలాపురం నియోజకవర్గం నూతన కమిటీని కోనసీమ జిల్లా అధ్యక్షుడు సత్య చింతా గురువారం ప్రకటించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడిగా పెండెం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బుడితి దయామహేష్, ప్రధాన కార్యదర్శిగా జనిపెల్లి సత్య ధర్మరాజు, కార్యదర్శిగా బండి శీనివాస్, కన్వీనర్‌గా కోలా త్రిమూర్తులును నియమించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు.











హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

యానాం: యూడీసీ పరీక్ష ఈ నెల 23న నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టికెట్లును డౌన్‌లోడ్ చేసుకోవాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ ఎగ్జామ్ సెల్ విభాగం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. పరీక్షకు యానాంలో–8 సెంటర్లు, పుదుచ్చేరి–107, కారైకల్–13, మాహే–5 సెంటర్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు 0413–2233338 నెంబరుకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సంప్రదిందొచ్చని చెప్పారు.

ఇంటి ముంగిటకు సేవలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు



టి.కొత్తపల్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ఐ.పోలవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే తీసుకొచ్చామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం టి.కొత్తపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా పేదల అభ్యున్నతికి సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పండు నళిని, ఎంపీడీఓ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఓ వరమని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. గురువారం తూర్పులంక, గోడితిప్ప గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే లబ్ధిదారుల నుంచి జన్మభూమి కమిటీ సభ్యులు డబ్బులు గుంజేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడలి గంగాచలం, చిట్నీడీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి రామారావు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్ నడింపల్లి సత్యనారాయణరాజు, ఎంపీటీసీ కుంచే చిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 1400 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్ దున్నా సత్యన్నారాయణ, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం పల్లవారిపాలెం సచివాలయం పరిధిలో పళ్లవారిపాలెం, క్రాపచింతలపూడి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. సర్పంచ్‌లు చిక్కం వెంకట పద్మజ, చింతలపూడి ధన నాగమణిలు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, ఎంపీడీఓ జె.రాంబాబు, కోలా బాబ్జి, రాయపురెడ్డి జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, చొల్లంగి సుబ్బరామ్, రాజులపూడి మురళీకృష్ణ, నక్కా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లిలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో బెడ బుడగ జంగాలకు ఎస్సీ కుల ధృవ పత్రాలు అందించాలని బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కేఎస్ గౌరీకుమారికి సంఘ నాయకులు వినతిపత్రం అందించారు.



జగనన్న సురక్ష సర్టిఫికెట్‌లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



పి.మల్లవరంలో మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ తదితరులు

డీడీఏటీ జేఓగా అదనపు బాధ్యతలు

యానాం: యానాం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీస్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా వినోకోటి ఉషారాణికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పుదుచ్చేరి ఆర్థికశాఖ కార్యదర్శి రత్నఘోష్ కిషోరాచారి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పీడబ్ల్యూడీ కార్యాలయంలో జేఏఓగా ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు.

ఐటీఐ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఐటీఐల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడానికి సంబంధించిన ఫైలుకు గురువారం ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ ఆమోద ముద్ర వేశారు. ఒకేషనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కనీస అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకుంటామని గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీఎం రంగసామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఒకేషనల్ ట్రైనింగ్ పొందే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో యానాంలో 99 మంది, మాహే–77 మంది, కారైకల్–460 మంది విద్యార్థులకు ఆయా పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్న సెంట్రల్ కిచెన్‌ల నుంచి మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయనున్నారు.


15న యథావిధిగా పాఠశాలల నిర్వహణ

యానాం: జులై 15న యథావిధిగా పాఠశాలలు తెరిచే ఉంటాయని పుదుచ్చేరి పాఠశాల విద్యాశాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. యానాంలో సీబీఎస్ఈ అమల్లోకి వచ్చాక వారానికి ఐదు రోజులే పాఠశాలలు నడుస్తున్నాయి. అయితే వేసవి కాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నేపథ్యంలో పాఠశాలలు ఆలస్యంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వర్కింగ్ డేస్‌ను అమలు చేసేందుకు వీలుగా శనివారాల్లో సైతం పాఠశాలలను తెరవాలని నిర్ణయించారు. అయితే జులై 22వ తేదీ శనివారం మాత్రం నాలుగు రీజియన్‌ల్లోనూ కాంపిటేటివ్ పరీక్షలున్న నేపథ్యంలో సెలవు ప్రకటించారు.

కోర్టు ఆదేశాలు పాటించాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా కాజువల్ లేబరర్స్, డైలీరేటెడ్ సిబ్బంది నియామకం ,రెగ్యులరైజేషన్‌కు సంబంధించి మద్రాసు హైకోర్టు ఆదేశాలను పాటించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ గురువారం అన్ని శాఖలకు నోటీసు జారీ చేశారు. గతంలో దొడ్డిదారిన, చట్టవిరుద్ధంగా ప్రభుత్వ ఆమోదం లేని పోస్టుల్లో పలువురు సీఎల్ఆర్‌లను, పార్ట్‌టైమ్ సిబ్బందిని నియమించారని పలువురు కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారన్నారు. అయితే చట్ట విరుద్ధ నియామకాలను రెగ్యులరైజ్ చేయొద్దని కోర్టు పేర్కొందన్నారు. ఈ మేరకు అన్ని శాఖలు హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, ఎవరైనా ధిక్కరిస్తే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

లారీ బోల్తా



జి.మూలపాలంలో తిరగబడిన లారీ

ఐ.పోలవరం: విశాఖపట్టణం వెళుతున్న ఓ ట్రాన్స్‌పోర్ట్ లారీ గురువారం జి.మూలపాలంలో ప్రమాదవశాత్తూ అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొని పంట బోదెలోకి బోల్తా పడింది. ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచక్యంగా బయటపడినా క్లీనర్ మాత్రం లారీ లోపలే ఉండిపోవడంతో కాలు నుజ్జునుజ్జయింది. గాయపడిన క్లీనర్‌ను 108 వాహనంలో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.